నేడువిద్యుత్ ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీ కాలనీ : మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈలు భీమలింగప్ప, వాణి, చైతన్య తెలిపారు. బాలాజీ నగర్ సెక్షన్ పరిధిలో.. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆంజనేయ నగర్, జనతా నగర్, మూసాపేట్, ఇంద్ర నగర్ పరిసర ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హబీబ్ నగర్ మజీద్, పవర్ నగర్ పార్క్, ప్రగతి నగర్, వసుంధర వైద్య శాల పరిసర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

వసంత నగర్ సెక్షన్ పరిధిలో..

ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు భగత్ సింగ్ నగర్, సర్దార్ పటేల్ నగర్, కేపీహెచ్‌బీ కాలనీ, 6వ పేజ్ పరిసర ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోతుందని ఏఈ వాణి తెలిపారు. కూకట్‌పల్లి సెక్షన్ పరిధిలో.. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు దేవి నగర్, కేరళ బస్తీ, శాంతినగర్ వెంకట్రావునగర్ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివేకానంద నగర్, సుమిత్ర నగర్ పరిసర ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోతుందని ఏఈ చైతన్య తెలిపారు.

జీడిమెట్ల : మరమ్మతుల కారణంగా 11 కె.వి. ఏపీఐఐసీ ఫీడర్ జీడిమెట్ల సబ్‌స్టేషన్ -1 పరిధిలో మంగళవారం సరఫరాలో అంతరాయం కలుగుతుందని జీడిమెట్ల ఏఈ పి.ప్రసూన తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఏపీఐఐసీ కాలనీ, సంజయ్ గాంధీ నగర్, జీడిమెట్ల సబ్‌స్టేషన్ - 3 లో 11 కె.వి.పైపులైన్ రోడ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గంపల బస్తీ, గణేశ్ గ్రౌండ్స్, విజయశ్రీ కెమికల్స్ ఇండస్ట్రియల్ ఏరియా సరఫరా ఉండదు.

మాదాపూర్ : మరమ్మతుల కారణంగా చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కె.వి.మదీనాగూడ ఫీడర్ పరిధిలోని ఆర్టీసీ కాలనీ, మదీనాగూడ, ల్యాండ్ మార్క్ రెసిడెన్సీ, మదీనాగూడ ప్రధాన రహదారిలో ఉదయం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, 11 కె.వి. మార్కెట్ ఫీడర్ పరిధిలోని సీఎం తోట, శిల్పా గార్డెన్ ఏరియా, వెంకటేశ్వర నగర్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ దీప్తి తెలిపారు.

రాజకీయ కుట్రతో..కేటీఆర్‌పై అసత్య ఆరోపణలు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 16: పరిపాలన చేతకాని కాంగ్రెస్ సర్కార్.. రాజకీయ కుట్రతో మాజీ మంత్రి కేటీఆర్‌పై అసత్య ఆరోపణలు చేస్తుందని, ఫార్ములా ఈ రేస్ కేసులో కేటీఆర్‌ను విచారించడం సిగ్గుచేటని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ విచారణకు తీసుకెళ్లడాన్ని నిరసిస్తూ.. ఎమ్మెల్యే మాధవరం ఆధ్వర్యంలో కార్పొరేటర్లు.. బీఆర్ఎస్ నాయకులు బీఆర్ఎస్ భవన్‌కు తర్వాత ఏసీబీ కార్యాలయానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏడాదిన్నర కాలంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమై.. పరిపాలన చేతకాని రేవంత్‌రెడ్డి సర్కార్.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌పై అసత్య ఆరోపణలు చేస్తుందన్నారు. వారిపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బంది పెడుతుందన్నారు. ధర్మం ఎప్పటికైనా నిలుస్తుందని, చివరకు గెలుస్తుందన్నారు. పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తొలి సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం 10 ఏండ్లలో కనివిని ఎరుగని రీతిలో ఆదర్శవంతంగా అభివృద్ధి చెందిందని తెలిపారు. నేడు కేసీఆర్, కేటీఆర్‌పై అసత్య ఆరోపణలు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. నాడు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచితే.. కాంగ్రెస్ పాలకులు ఆ ఇమేజ్‌ని కాపాడలేకపోతున్నారని విమర్శించారు. రాజకీయ కక్షలు మానుకొని ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలని, ప్రజలకు సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాలు కల్పిస్తే బాగుంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోతుందని, రాష్ట్రంలో అన్నిరంగాలు కుదేలయ్యాయన్నారు. వ్యాపారాలు లేక చిరు వ్యాపారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కన్నీరు మున్నీరు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాలకులు దిగిపోవాలని, కేసీఆర్ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ఎన్ని కుట్రలు చేసినా.. రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నియోజవర్గం కో - ఆర్డినేటర్ సతీశ్ అరోరా, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కేటీఆర్‌పై ఏసీబీ విచారణ నిరసిస్తూ.. తెలంగాణ భవన్‌కు తరలివెళ్లిన ఎమ్మెల్యే కృష్ణారావు, బీఆర్ఎస్ నాయకులు

నేడు అల్లాపూర్‌లో ఎమ్మెల్యే పర్యటన

అల్లాపూర్,జూన్16 : కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నేడు అల్లాపూర్ డివిజన్‌లో పర్యటించనున్నట్లు కార్పొరేటర్ సబిహా బేగం తెలిపారు. మంగళవారం సఫ్దర్ నగర్ హిందూశ్మశాన వాటికలో జరుగుతున్న అభివృద్ధి పనుల పరిశీలన, కాముని చెరువు, సున్నం చెరువు సుందరీకరణ పనులను పరిశీలించనున్నారు. అల్లాపూర్ వార్డ్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పెద్దఎత్తున పాల్గొనాలని కార్పొరేటర్ కోరారు.

మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

మియాపూర్, జూన్ 16: మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నామని హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్ని శ్రీనివాసరావు పేర్కొన్నారు. రామ్ నరేశ్‌నగర్ 5వ లైన్‌లో నూతనంగా చేబడుతున్న కాలువ పనులను కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ సోమవారం ప్రారంభించారు. కాలనీవాసుల భాగస్వామ్యంతో అభివృద్ధి పనులను పూర్తిచేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కార్పొరేటర్ స్పష్టం చేశారు.

కుత్బుల్లాపూర్ : ' టిఫిన్లు వద్దు.. చద్దన్నమే ముద్దు ' నినాదంతో పూర్తిగా రాగులు, జొన్నలు వంటి అనేక రకాలైన పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని ప్రజలకు గుర్తు చేసినందుకు చద్దన్నం మాటను తిరిగి ఇప్పటి తరానికి పరిచయం చేసేందుకు కొత్తగా స్టాల్ ఏర్పాటు చేశాడు. స్థానికులు స్టాల్ ను సందర్శించి పూర్వపు వంటలను గుర్తు చేసుకున్నారు. తక్కువ ధరలకు అందించడంతో సందర్శకులతో కిటకిటలాడింది.

ఫిట్‌నెస్ లేని ఆరు బస్సులు సీజ్

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 16: ఫిట్‌నెస్ లేని ఆరు ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్‌ల కు చెందిన బస్సులను సీజ్ చేసినట్లు కూకట్‌పల్లి ఎంవీఐ శీనుబాబు తెలిపారు. సోమవారం కూకట్‌పల్లి పరిధిలోని పలు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, స్కూల్, కాలేజీలకు చెందిన బస్సుల ధ్రువపత్రాలను పరిశీలించినట్లు తెలిపారు. నిబంధనలు పాటించని బస్సుల యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో సోమవారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) . టమాట 23, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 45, బజ్జి మిర్చి 23, కాకర 38, బీర 45, క్యాబేజీ 16, ఫ్రెంచ్ బీన్స్ 55, క్యారెట్ 40, కాలీఫ్లవర్ 28, దొండ 18, చిక్కుడు 45, గోరుచిక్కుడు 28, బీట్ రూట్ 27, క్యాప్సికం 55, ఆలు 24, కీర 23, దోస 18, సోర 12, పొట్లకాయ 23, కంద 45, ఉల్లిపొరక 45, ఉల్లిగడ్డ 24, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ 9 నుంచి 11, చామగడ్డ 28, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 30, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు(12) 24 నుంచి 30, మునగకాయ(1) 5 నుంచి 6, పచ్చి బఠాని ...., పొప్పడికాయ 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, కరివేపాకు 70గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

ఫిర్యాదులను పరిశీలిస్తాం

ఖానామేట్ రహదారి వెంటవ్యర్థాలు పోస్తున్నారని డీసీ మోహన్ రెడ్డికి వివరిస్తున్న కాలనీవాసులు

మియాపూర్, జూన్ 16: ప్రజావాణిలో వచ్చే సమస్యలపై ప్రజలు అందించే వినతులపై చర్యలు చేపడతామని చందానగర్ ఉపకమిషనర్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీసీ కోరారు. చందానగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక , పారిశుధ్య విభాగాలకు సంబంధించి తొమ్మిది వినతులను అధికారులు స్వీకరించారు. డీసీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన వినతులపై సంబంధిత విభాగాలు అధికారులు యుద్ధ ప్రాతిపదికన క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని స్పష్టం చేశారు. విధిగా ప్రతి వినతిని రికార్డులలో నమోదు చేసి, చేపట్టిన చర్యలను దరఖాస్తుదారులకు వివరించాలని డీసీ తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ నాగిరెడ్డి, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 18 ఫిర్యాదులు

కూకట్‌పల్లి జోన్ ఆఫీస్‌లో ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జడ్సీ అపూర్వ చౌహాన్

కేపీహెచ్‌బీ కాలనీ : కూకట్‌పల్లి జోన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 15 ఫిర్యాదులు వచ్చినట్లు జడ్సీ అపూర్వ చౌహాన్ తెలిపారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 5, ఇంజినీరింగ్ విభాగానికి 5, ఉద్యానవన విభాగానికి 2, ఎలక్ట్రికల్ విభాగానికి ఒకటి, అడ్మినిస్ట్రేషన్ విభాగానికి ఒక ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు. మూసాపేట్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఐదు ఫిర్యాదులు రాగా.. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 3 ఇం.ఇనీరింగ్ విభాగానికి ఒకటి శానిటేషన్ విభాగానికి ఒక ఫిర్యాదు వచ్చినట్లు సర్కిల్ ఉపక కమిషనర్ వంశీకృష్ణ తెలిపారు. కూకట్‌పల్లి సర్కిల్ ఆఫీసులో నిర్వహించిన ప్రజావాణికి 8 ఫిర్యాదులు రాగా.. వచ్చిన ఫిర్యాదులన్నీ టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన పని సర్కిల్ ఉప కమిషనర్ గంగాధర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఆయా ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

విద్యాసంస్థలను స్థానికంగా ఏర్పాటు చేయాలి

శామీర్‌పేట్ గురుకుల మహిళా కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

జగద్గిరిగుట్ట, జూన్ 16: జగద్గిరిగుట్ట ప్రాంతానికి కేటాయించిన విద్యాసంస్థలను స్థానికంగానే ఏర్పాటు చేయాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. శామీర్‌పేట్‌లో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ గురుకుల, మహిళా డిగ్రీ కళాశాల వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. జగద్గిరిగుట్ట సర్వే నం. 348/1లో ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కేటాయించిన చోట ఎందుకు విద్యాసంస్థలను ఏర్పాటు చెయ్యడంలేదని ప్రశ్నించారు. ఇంటిగ్రేటెడ్ కాలేజీలు నిర్మిస్తున్న నేపథ్యంలో జగద్గిరిగుట్టలో ఎస్సీ ఎస్టీ , బీసీ, మైనార్టీ గురుకులాలకు స్థలం కేటాయించాలని సూచించారు. జగద్గిరిగుట్టకు కేటాయించి వేరే చోట నిర్వహిస్తున్న విద్యా సంస్థలను మళ్లీ గుట్టలోనే ఏర్పాచేయాలన్నారు. ఐఎన్టీయూసీ, దళిత సంఘాల నాయకులు ఐలయ్య, అమర్ బాబు, జేమ్స్ పాల్గొన్నారు

ప్రజల రక్షణకు.. సీసీ కెమెరాలు

బాలానగర్, జూన్ 16 : ప్రజల రక్షణకు సీసీ కెమెరాలు దోహద పడుతాయని బాలానగర్ సీఐ నరసింహ రాజు అన్నారు. సోమవారం చేరబండ రాజు నగర్‌లోని జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన 16 సీసీ కెమెరాలను సీఐ ప్రారంభించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి సహకరించిన ప్రమోద్ మోడీని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సై సరితా రెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ అరుణ్ జ్యోతి, స్థానికులు పాల్గొన్నారు.

హౌసింగ్ బోర్డు భూముల్లో ఆక్రమణల తొలగింపు

ఆక్రమణల తొలగింపులో హౌసింగ్ బోర్డు సిబ్బంది

జగద్గిరిగుట్ట, జూన్ 16 : హౌసింగ్ బోర్డు భూముల్లో ఆక్రమణలపై అధికారులు చర్యలు చేపట్టారు. రంగారెడ్డి నగర్ డివిజన్ ఏపీఎస్ బీ కాలనీలోని సంస్థకు ఖాళీ స్థలంలో కొన్నేండ్లుగా నిర్మాణ సామగ్రి డంపింగ్, అక్రమ షెడ్లతో వ్యాపారాలు సాగిస్తున్నారు. హౌసింగ్ బోర్డు స్థలాలు వేలం వేసేందుకు కార్యాచరణ ప్రారంభం అవడంతో.. హౌసింగ్ బోర్డు ఉన్నతాధికారి గౌతమ్ ఐడీపీల్ చౌరస్తా సమీపంలోని 2.25 ఎకరాల స్థలాన్ని పరిశీలించి చర్యలకు ఆదేశించగా ఆక్రమణదారులకు నోటీసులిచ్చారు. ఖాళీ చేయకపోవడంతో చర్యలకు దిగారు. పోలీస్ బందోబస్తుతో సోమవారం షాపులు, షెడ్లను జేసీబీతో తొలగించారు. ఇసుక, కంకర వ్యాపారులకు వాటిని వేరేచోటుకు తరలించుకోవాలని సూచించారు. ఖాళీ స్థలానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి వేలానికి ఓపెన్ ప్లాట్లు సిద్ధం చేస్తామని అధికారులు తెలిపారు. హౌసింగ్ బోర్డు సెక్రటరీ రాజేశం, ఈఈ అంకమరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒకటి మాత్రమే కూల్చారు

పుట్‌పాత్‌పై వెలసిన ఆక్రమణను తొలగించిన అధికారులు

అల్లాపూర్ : మోతీనగర్ పరిధిలోని బాలాజీ స్వర్ణపురి కాలనీలో ఓ స్కూల్ యాజమాన్యం పుట్‌పాత్‌పై నిర్మించిన తాత్కాలిక షెడ్డును జీహెచ్ఎంసీ మూసాపేట -23 టౌన్‌ప్లానింగ్ అధికారులు సోమవారం కూల్చివేశారు. బాలాజీ స్వర్ణపురి కాలనీలో అన్నివీధుల్లో రేకుల షెడ్లతో రోడ్లపై నిర్మాణాలున్నాయని, కేవలం ఒక్కటి మాత్రమే అధికారులు కూల్చివేసి చేతులు దులుపుకున్నారని కాలనీవాసులు విమర్శిస్తున్నారు. ఇక మోతీనగర్‌తో పాటు రాజీవ్‌నగర్ ప్రధాన రహదారుల్లో వాహనాలు పార్కింగ్ చేయడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు సైతం రాజీవ్‌నగర్, మోతీనగర్ రోడ్ల ఆక్రమణలపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. టౌన్‌ప్లానింగ్ అధికారులు మిగతా స్థానాల్లోని ఆక్రమణలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదంటూ ప్రశ్నిస్తున్నారు..? బాలాజీ స్వర్ణపురి కాలనీలో రోడ్లపై వెలసిన రేకుల షెడ్లను అధికారులు తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు. విషయమై జీహెచ్ఎంసీ మూసాపేట టౌన్ ప్లానింగ్ ఏసీపీ కరుణాకర్‌ను వివరణ కోరగా.. రోడ్ల ఆక్రమణలన్నిటిపై చర్యలు తీసుకుంటామని సమాధానం ఇచ్చారు.



బాలాజీ స్వర్ణపురి కాలనీలోని జీహెచ్ఎంసీ పార్క్‌లైన్‌లో రేకుల షెడ్డు

కేపీహెచ్‌బీ కాలనీ : శ్రీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి 32వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం పూజతో పాటు మృత్యుంజయ యాగం, లక్ష పుష్పార్చన జరిగాయి.

వరద నివారణ చర్యలు చేపట్టాలి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ హేమంత్ బర్కడే

మియాపూర్, జూన్ 16 : వర్షాకాలం నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని శేరి లింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ బర్కడే తెలిపారు. కొత్తగా హైడ్రా పరిధిలోకి మాన్‌సూన్ విభాగం వెళ్లినందున ఆయా విభాగాల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు. జోనల్ కార్యాలయంలో సోమవారం ఇంజినీరింగ్, హైడ్రా సిబ్బందితో వర్షాకాల పరిస్థితులపై జడ్సీ సమీక్షా సమావేశం నిర్వహించారు. జడ్సీ మాట్లాడుతూ.. భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రధాన రహదారులు అంతర్గత రహదారులు లింకు రోడ్లలో వరద నీరు నిలువ లేకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హైడ్రా విభాగంతో ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకుంటూ పని చేయాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ ,ఫైర్ ,శానిటేషన్, విద్యుత్ విభాగాలు పరిస్థితులను సమీక్షిస్తూ వరద నీటిని నిల్వ లేకుండా చూడడంతో పాటు ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు వరదలతో విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తుగా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు .ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే అని జోనల్ కమిషనర్ తెలిపారు.

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 16: వర్షాకాలంలో ముంపు సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ అన్నారు. సోమవారం కూకట్‌పల్లి జోన్ కార్యాలయంలో ఐదు సర్కిళ్లకు చెందిన జీహెచ్ఎంసీ అధికారులు, హైడ్రా, జలమండలి, విద్యుత్ విభాగాల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ.. వరద నీటి కాలువలలో చెత్తాచెదారాన్ని తొలగించి నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలతో చెట్లకొమ్మలు పడిపోతే వాటిని తొలగించాలని, రోడ్లపై పడిన గుంతలను పూడ్చాలన్నారు. అత్యవసర సమయాల్లో మాన్‌సూన్ బృందాలు అందుబాటులో ఉండాలన్నారు. ముంపు సమస్యలు ఎదురైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. ఆయా విభాగాల అధికారులు సమన్వయంతో పని చేసి.. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి జోన్ ఆఫీస్‌లో వర్షాకాలం సమస్యలపై అధికారులతో సమీక్షలో జెడ్సీ అపూర్వ చౌహాన్

భవన నిర్మాణ సంక్షేమ మండలిని ప్రైవేట్ ఇన్సూరెన్సులకు కట్టబెట్టొద్దు

జగద్గిరిగుట్ట జూన్ 16: భవన నిర్మాణ సంక్షేమ మండలిని ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు కట్టబెట్టొద్దని కార్మిక సంఘాల నినాదం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జగద్గిరిగుట్ట లాస్ట్ బస్‌స్టాప్‌లో సమావేశమయ్యారు. సమస్యపై మంగళవారం జరిపే చలో కార్మిక భవన్‌లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, భవన నిర్మాణ సంఘం నాయకులు ఏసురత్నం, శ్రీనివాస్,హరినాథ్ రావ్, బాలాజీ , జంబు, ముసలయ్య, రాములు, ఆశయ్య , కార్మికులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో భవనంపై నుంచి పడి ..

శేరిలింగంపల్లి : భవనంపై నుంచి పడి అనుమానాస్పద స్థితిలో ఓ కార్మికుడు మృతి చెందిన ఘటన రాయదుర్గం పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూపీ, ఆగ్రా జిల్లా, భవానీ పురానికి చెందిన నార్డ్ కిశోర్ (30) టైల్స్ పని చేస్తుంటాడు. ఖాజాగూడ సాయికృపా కాలనీలో పని చేసేందుకు నాలుగు రోజుల క్రితం తోటివారితో వెళ్లి అదే భవనంలో ఉంటున్నాడు. ఆదివారం రాత్రి భోజనం చేసి భవనం పైకెక్కి పడుకున్న కిశోర్ ఉదయం చూసేసరికి గాయాలతో కిందపడి మృతి చెందాడు. ముక్కులో నుంచి రక్తం, ఒంటిపై గాయాలు ఉన్నాయి. గమనించిన సైట్ వాచ్‌మన్ సమాచారం మేరకు రాయదుర్గం పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని ఉస్మానియా తరలించారు. మృతుడి అన్న ఎల్‌బీ నగర్‌కు చెందిన దశరథ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి ..

శేరిలింగంపల్లి : రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గచ్చిబౌలి పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఔటర్‌రింగ్ రోడ్డు వట్టినాగులపల్లి ప్రాంతంలో సర్వీస్ రోడ్ సమీపంలో కారు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి తీవ్రగాయాలకు గురయ్యాడు. రక్తపు మడుగులో పడి ఉన్న అతనిని చికిత్స నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కాగా .. సోమవారం చికిత్స పొందుతూ సదరు వ్యక్తి మృతి చెందాడు. మృతుడి (37) ఒంటిపై బ్లాక్ టీ షర్ట్, బ్లూ జీన్స్ ఉన్నాయని పోలీసులు తెలిపారు. వివరాలకు గచ్చిబౌలి పోలీసులను సెల్ నం. 871256 8276 లో సంప్రదించాలని సూచించారు.

25న జరిగే బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్ష వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఈనెల 25న నిర్వహించనున్న బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. యూజీసీ నెట్ పరీక్ష నేపథ్యంలో ఆ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు చెప్పారు. ఈ పరీక్షను తిరిగి ఈనెల 30వ తేదీన నిర్వహించనున్నామన్నారు. పరీక్షా కేంద్రం సమయం లలో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. ఇతల వివరాలకు ఓయూ వెబ్సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.